

## రేపు సీఎం రేవంత్ రోడ్ షో

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు హనుమకొండ వేయిస్థంబాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా వరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించనున్నట్లు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతోపాటు వరంగల్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ప్రచారంలో పాల్గొననున్నారు. అనంతరం హనుమకొండ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులూ, కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ


# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 271 సోమవారం | 06 మే 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


8లో



## బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు అడిగే హక్కు లేదు

పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపాం

మీట్ ది ప్రెస్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్

# పార్టీ ఫండ్ హాంఫట్..?





బీఆర్ఎస్‌లో పార్టీ ఫండ్ గొడవ కాక రేపుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లోనైనా అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలో తిరిగి తమ సత్తా చాటాలన్న లక్ష్యంతో పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అడుగులు వేస్తుంటే మాజీ ఎమ్మెల్యేలు మాత్రం దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న ఆలోచనతో వ్యవహరించడం ఆ పార్టీలో కల్లోలం సృష్టిస్తోంది. ఎన్నికల ప్రచారం నిమిత్తం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి అధిష్ఠానం పార్టీ ఫండ్ కింద రెండు విడతల్లో దాదాపు రూ.15 కోట్లు విడుదల చేసినా అందులో ఒక్కపైసా కూడా బూత్ కమిటీలు, కార్యకర్తలకు అందలేదన్న ఆరోపణలున్నాయి. వరంగల్ లోక్ సభ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పర్యవేక్షణలోనే పార్టీ ఫండ్ నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యేలు పర్సంటేజీల వారీగా పంచుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలకే వారి నియోజకవర్గంలో ప్రచార బాధ్యతలు అప్పగించినా నిధుల ఖర్చు చేసేందుకు సదరు మాజీలు ససేమిరా అనడంతో ప్రచారం నీరసించిపోతుందని కార్యకర్తలు బాహాటంగా విమర్శిస్తున్నారు. పార్టీ ఫండ్ పంచుకోవడంపై బీఆర్ ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ముఖ్య నేతలంతా నిధులు మింగి నిద్రపోతే పార్టీ అభ్యర్థి ఎలా గెలుస్తాడని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోకుంటే అసెంబ్లీ ఎన్నికల నాటి సీన్ రిపీట్ అవుతుందని హెచ్చరిస్తున్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి

**రూ.15 కోట్లు పంచుకున్న మాజీ ఎమ్మెల్యేలు**

**కార్యకర్తలకు మొండిచెయ్యి**

**తీవ్ర అసంతృప్తిలో గులాబీ శ్రేణులు**

**నిధులివ్వకుంటే గెలిచేదెలా..**

**పార్టీ గెలుపుపై తీవ్ర ఎఫెక్ట్**





2లో

## బీజేపీని గద్దె దించుదాం.. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..

దేశాన్ని అమ్మకానికి పెడుతున్న మోడీ

వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

8లో



## 8న నగరానికి ప్రధాని మోడీ

ఓరుగల్లు జన సభను విజయవంతం చేద్దాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

# పార్టీ ఫండ్ హాంఫట్..?




**రూ.15 కోట్లు పంచుకున్న మాజీ ఎమ్మెల్యేలు**
**కార్యకర్తలకు మొండిచెయ్యి**
**తీవ్ర అసంతృప్తిలో గులాబీ శ్రేణులు**
**నిధులివ్వకుంటే గెలిచేదెలా..**
**పార్టీ గెలుపుపై తీవ్ర ఎఫెక్ట్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ లోక్ సభ ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతుండటంతో బీఆర్ఎస్ లో పార్టీ ఫండ్ గొడవ కాక రేపుతోంది. ఆ పార్టీ అభ్యర్థి ఎంపిక కోసం అధినేత కేసీఆర్ మల్లగుల్లాలు పడ్డ తర్వాత డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ ను తుదకు అభ్యర్థిగా ఖరారు చేశారు. అయితే ఆయన గెలుపునకు పార్టీ అధిష్ఠానం పార్టీ ఫండ్ కింద రెండు విడతల్లో దాదాపు రూ.15 కోట్ల వరకు పంపించినట్లు సమాచారం. ఈ నిధుల గోల్ మాల్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చిచ్చురేపుతోంది. వరంగల్ లోక్ సభ నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పర్యవేక్షణలో మాజీ ఎమ్మెల్యేలు పార్టీ ఫండ్ ను నియోజకవర్గాల వారీగా పంచుకున్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీ ఫండ్ తిన్న సీనియర్ నాయకులు, మాజీలు ప్రచారాన్ని గాలికొదిలి గుర్రు పెట్టి నిద్రపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ అధినేత, ఇతర ప్రముఖులు వచ్చి ప్రచారం చేసిన సమయంలో స్టేజీలెక్కి బిల్డప్ లిస్తున్న వారంతా తర్వాత మొఖం చాటేస్తున్నారని స్థానిక కార్యకర్తలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ప్రచారంలో ముఖం చాటేసే నేతలపై కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

### తిన్నారు.. పన్నారు..

డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ గెలుపు బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు అనివార్యం. అభ్యర్థి గెలుపునకు పార్టీ అధిష్ఠానం సీరియస్ గా వ్యూహాలు రచిస్తుంటే ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు వాటిని చాలా తేలిగ్గా తీసుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది. ఎన్నికల ప్రచారంలో సైతం అంటీముట్టనట్టు వ్యవహరించడంతో కార్యకర్తల్లో జోష్ తగ్గుతోంది. దీనికి తోడు ఇప్పుడు పార్టీ ఫండ్ పంపకం పార్టీలో రచ్చ రేపుతోంది. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల నిర్వహణ కోసం ఇచ్చిన ఫండ్ ను ఆ పార్టీ ముఖ్య నేతలు పంచుకొని కార్యకర్తలకు మొండి చేయి చూపుతున్నారనే చర్చ లోక్ సభ ఎన్నికల సమయంలో కాక పుట్టిస్తోంది. పార్టీ ఫండ్ వచ్చే వరకు అక్కడో.. ఇక్కడో తిరిగినట్లు నటించిన ముఖ్య నేతలు ప్రస్తుతం ముఖం చాటేయడంపై మండిపడుతున్నారు. కేసీఆర్ వరంగల్ కార్నర్ మీటింగ్ లో కనిపించిన నాయకులు ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు.



గ్రామాల్లో జరిగే ఈజీఎస్ పనుల వద్ద ఫోటోలకు ఫోజులిస్తూ ప్రచారాన్ని 'మమ' అనిపించారు. వచ్చిన నిధులు కార్యకర్తలకు పంచకుండా వారే తిని.. బజ్జున్నారంటూ కార్యకర్తల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### దాట వేస్తున్న బాధ్యులు..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో వరంగల్ లోక్ సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్ల పరిధిలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు పార్టీ ఫండ్ కింద బీఆర్ఎస్ అధిష్ఠానం పంపించిన రూ.15 కోట్లను తలా కొంచెం ఎన్నికల ఖర్చుల నిమిత్తం తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన కొందరు నేతలు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎవరూ వెళ్లి వారిని కలిసినా పార్టీ ఫండ్ రాలేదని దాటవేస్తున్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ లోక్ సభ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ ను అడిగితే ఆ విషయం మీ నియోజకవర్గ ఇంచార్జులకే తెలుసంటూ దాటవేయడంపై కార్యకర్తలు భగ్గుమంటున్నారు. దీంతో పార్టీ ఫండ్ వచ్చినా రాలేదంటూ నియోజకవర్గ ఇంచార్జులు కార్యకర్తలను మోసం చేస్తున్నారని, అబద్ధాలు ఆడుతూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడుతున్నారు. దీంతో కార్యకర్తలు పార్టీ గెలుపు కష్టమేనని తీవ్ర అంసతృప్తిలో ప్రచారానికి వెనుకడుగు వేస్తున్నారు.

### కష్టంగా ప్రచారం..

పార్టీ టికెట్ ఇస్తే చాలు కోట్లు ఖర్చు పెట్టయినా సరే సొంతంగా నెగ్గుకొస్తామనే నేటి రాజకీయ భారతంలో పార్టీ ఫండ్ పంపించినా వాటిని దిగమింగి.. పార్టీ నెత్తిపై శఠగోపం పెడుతున్న తీరు కార్యకర్తలను తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. గెలుపు బాధ్యత తీసుకోవాల్సిన నియోజకవర్గ ఇంచార్జులే (మాజీ ఎమ్మెల్యేలు) ఫండ్ మొత్తం కాజేసి.. ముఖం చాటేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ తీరు పార్టీ మనుగడకు పెను సవాల్ గా మారుతోందని మండిపడుతున్నారు. ఉద్యమకారుడు, సాత్వికుడు డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ ను పార్టీ అధిష్ఠానం అభ్యర్థిగా నిలిపినా పార్టీ ఫండ్ మీదే ఆయన ప్రచారం ఆధారపడి ఉంది. ఆయనకు పార్టీ అందించిన రూ.95 లక్షలతో పాటు తను అదనంగా అప్పుగా తెచ్చుకున్న కొంచెం డబ్బులు ఇప్పటి వరకు ఖర్చు చేసి నెట్టుకొచ్చారు. పార్టీ ఫండ్ లేకుండా ఏడు నియోజకవర్గాల్లో ప్రచారం చేయడం ఆయనకు కష్టంగా మారింది. బూత్ కమిటీలు, చోటా మోటా నాయకులకు, పార్టీ ప్రచార కార్యక్రమాలకు ఆయన వద్ద ఉన్న డబ్బు సరిపోవడం లేదు. కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన పార్టీ ఫండ్ ఏడు సెగ్మెంట్లలోని మాజీ ఎమ్మెల్యేలు ప్రచార కార్యక్రమాలకు వినియోగించకుండా పంచుకోవడం వివాదాస్పదంగా మారుతోంది. దీంతో అభ్యర్థి మారపెల్లి పరిస్థితి ముందు గొయ్యి.. వెనుక నుయ్యి అన్నట్లుగా మారింది.

### ఎలా గెలుస్తాం..?

క్షేత్ర స్థాయిలో పనిచేసే పార్టీ కార్యకర్తలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్నికల ప్రచారమంటేనే ఖర్చుతో కూడుకుంది. రోజువారీ ఖర్చులు సొంతంగా పెట్టుకొని ఏ కార్యకర్త ప్రచారం చేసేందుకు సాహసించదు. ఎందుకంటే కార్యకర్తల్లో అత్యధికులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. పార్టీ ఫండ్ దిగమింగిన నియోజకవర్గ ఇంచార్జులు కార్యకర్తలకు రూపాయి కూడా విదల్చకపోవడంతో స్థానికంగా ప్రచారం పడకేస్తోంది. దీంతో పార్టీ కార్యకర్తలు ప్రచారంలో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ ఫండ్ తమకు ఇవ్వకుంటే ప్రచారం చేయడం అసంభవమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇలా అయితే ఎలా గెలుస్తామని తమలో తామే కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ అగ్ర నేతలు కేసీఆర్, కేటీఆర్ లు జోక్యం చేసుకొని పార్టీ పరిస్థితిని చక్కదిద్దకపోతే పార్టీకి ఈ లోక్ సభ ఎన్నికల్లోనే కాక, భవిష్యత్తులో కూడా తీవ్రంగా నష్టపోయే పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారు.

## బీజేపీని గద్దె దించుదాం.. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇన్నాళ్లు మనందరిని అంబేద్కర్ కాపాడారు.. ఇప్పుడు అంబేద్కర్ ను కాపాడుకోవాల్సిన పరిస్థితిని కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ తెచ్చిందని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీని గద్దె దింపితేనే మన రాజ్యాంగానికి రక్షణ లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. హనుమకొండ అసుంత భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ సమ్మేళనంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దాల్వీ, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజుతో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, రిజర్వేషన్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. నరేంద్ర మోదీ దేశాన్ని విచ్చిన్నం చేస్తూ విద్వేషాన్ని రెచ్చగొడుతూ మనుషుల్ని కులాలుగా, మతాలుగా, ప్రాంతాలుగా విడదీసి రాక్షస పాలన సాగిస్తుంటే రాహుల్ గాంధీ విద్వేషక వాతావరణంలో ప్రేమను పంచుతున్నారన్నారు. నరేంద్ర మోదీ దేశాన్ని అమ్మకానికి పెడుతున్నారని మండిపడ్డారు. దళితులు, పేదలు, క్రిస్టియన్ లు, ముస్లింలు, మహిళలు అంటే గిట్టని బీజేపీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవాలన్నారు. రాహుల్ మాత్రమే దేశాన్ని ప్రగతి బాటలో ముందుకు తీసుకుపోతారన్నారు. బీఆర్ అంబేద్కర్ శక్తి ఏంటో మనం చూపించాలని పిలుపునిచ్చారు. మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### కడియం కావ్య రోడ్ షో..

ధర్మసాగర్ మండలం, రాంపూర్ గ్రామంలో సోమవారం స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య రోడ్ షో నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్ లో పాల్గొని ప్రసంగించారు. రోడ్ షోలో పాల్గొన్న కడియం కావ్యకు రాంపూర్ గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్నర్ మీటింగ్ లో కడియం కావ్య మాట్లాడుతూ.. సేవే లక్ష్యంగా ఇప్పటి వరకు పేదలకు వైద్యం అందించానని, ప్రజలకు మరింత సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయంగా మీ ముందుకు వచ్చానన్నారు. మీ గొంతుకగా పార్లమెంట్ లో గళమెత్తి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 35 ఏళ్ల తర్వాత ఒక మహిళకు అవకాశం వచ్చింది. పెద్ద మనసుతో ఆశీర్వదించాలని కావ్య కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## నర్సంపేట జనసభకు ఉత్తరాఖండ్ సీఎం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నర్సంపేటలో సోమవారం నిర్వహించిన జనసభకు ముఖ్యఅతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి హాజరయ్యారు. ఆయనకు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హెలిప్యాడ్ వద్ద ఘనస్వాగతం పలికారు. సభకు విచ్చేసిన అనంతరం ప్రజలు ఉద్దేశిస్తూ పుష్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఐదు నెలల కాలంలోనే పది సంవత్సరాల వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిందన్నారు.



## జిల్లా కోర్టులో అరూరి ప్రచారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కోర్టులో వరంగల్ లోక్ సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ న్యాయవాదులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులను కలిసి మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాతంగి రమేష్ బాబు, సీనియర్ న్యాయవాది అమరెందర్ రెడ్డి, నాయకులు కుసుమ సతీష్, సీనియర్ న్యాయవాదులు సి.విద్యాసాగర్ రెడ్డి, చోల్లేటి రామకృష్ణ, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొంగర పూర్ణచందర్, బీజేపీ లీగల్ సెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా హెూం ఓటింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నియోజకవర్గంలో ప్రశాంతంగా హెూం ఓటింగ్ కొనసాగుతోంది. లోక్ సభ ఎన్నికలలో 85 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం హెూం ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించింది. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో హెూమ్ ఓటింగ్ కోసం 345 మంది వృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి భగవాన్ రెడ్డి మాట్లాడుతూ. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారు ఓటు హక్కును తాము ఉన్నచోటు నుంచే వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని, ఓటర్లు ఈ అవకాశాన్ని ఎలాంటి ప్రాలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం, సోమవారాలలో హెూమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ఈ రెండు రోజులలో ఓటు వేయలేని వారి కోసం ఈ నెల 8న మరో అవకాశం కల్పించనున్నామని తెలిపారు.

## వరంగల్ గడ్డమీద గులాబీ జెండా ఎగరేస్తాం



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** లోక్ సభ ఎన్నికలో గులాబీ జెండా ఎగరవేయాలని, బీఆర్ఎస్ అభ్యర్థి డా.సుధీర్ కుమార్ ను గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 37వ డివిజన్ లో ఇంటింటి ప్రచారం తూర్పు కోట, మధ్య కోట, మైనారిటీ కాలనీ, పడమర కోట, జంగాల కాలనీ, గిరిప్రసాద్ నగర్, ఎంఎం నగర్ లలో విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కార్పొరేటర్ సువర్ణ సురేష్, మాజీ కార్పొరేటర్ బిల్లా కవిత శ్రీకాంత్ లు మాట్లాడుతూ అబద్దాల హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ను, మతోన్మాద బీజేపీ అభ్యర్థులను ఓడించాలని తెలంగాణ నినాదాన్ని, తెలంగాణ గళాన్ని, బలాన్ని వినిపించేందుకు ప్రజలందరూ బీఆర్ఎస్ అభ్యర్థి డా.మారపెల్లి సుధీర్ కుమార్ ను భారీ మెజారిటీ తో గెలిపించి, గులాబీ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంగరబోయిన విజయ్, బూత్ ఇంచార్జులు వనపర్తి ధర్మ రాజు, మంద శ్రీధర్ రెడ్డి, ఉమేష్, అరుణ్, వాసుదేవ్, సతీష్, మోహిస్, రమాదేవి, ఎల్లయ్య, నవీన్, సన్నీ, అరుణ్, రాజారం, ప్రభాకర్, వేణు, రమేష్, సోమశేఖర్, కుమార్, మధు, విజయ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులను ఆదుకునేందుకు సత్వర చర్యలు

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** నియోజకవర్గంలోని వివిధ మండలాలలో ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి పర్యటించారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అధికారులను అప్రమత్తం చెయ్యాలని కోరారు.. రైతులు ఎవరూ అధైర్య పడొద్దని మీ అందరికి అండగా ప్రభుత్వం ఉంటుందని స్థానిక శాసన సభ్యురాలుయశస్విని ఝాన్సి రాజేందర్ రెడ్డి భరోసా కల్పించారు. బలమైన ఈదురు గాలులతో పాటు వడగళ్ల వర్షానికి మామిడి రైతులకు అపార నష్టం వాటిల్లిందని, పేదల ఇండ్లు ఈదురు గాలలకు లేచిపోవడంతో పాటు కూలిపోయాయని బాధితులందరినీ ఆదుకునేందుకు సత్వర చర్యలు చేపడతామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం విచిన బలమైన ఈదురుగాలులకు, వడగండ్ల వర్షానికి మొక్కజొన్న, మామిడికాయలు, రాలిపోవడంతో పాటు ఇండ్లు కూలిపోయాయి అన్న సమాచారాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం పాలకుర్తి మండలం వావిలాల, మంచుప్పుల, గుడికుంట తండాలను సందర్శించి నష్ట పరిహారాన్ని పరిశీలించారు. బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్ట పరిహారంపై నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ వడగళ్ల వర్షానికి, ఈదురు గాలులకు నష్టపోయిన మామిడి రైతులకు, పంట రైతులకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.ఇండ్లు కూలిపోయిన బాధితులకు ప్రజా పాలనలో ప్రభుత్వం అందించే గృహాలను మొదటి ప్రాధాన్యతలో కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. రైతులెవ్వరు అధైర్య పడరాదని, ఎన్నికల అనంతరం పరిహారాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, సురేష్ నాయక్, కుమార్, రాజేష్ నాయక్, హరీష్, స్థానిక నాయకులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

### కడియం కావ్యను గెలిపించాలి..

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు స్థానిక శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి లోక్ సభ ఎన్నికల నేపథ్యలో విన్నూత్న రీతిలో ప్రచారం చేశారు. గడ్డపార పట్టి ఉపాధిహామీ కూలీలతో కలిసి కొద్దిసేపు పనులు చేసి వారితో ముచ్చటించారు. నమూనా బ్యాలెట్ ను చూపిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి డా. కడియం కావ్య రెండో నెంబర్ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. లోక్ సభ ఎన్నికల్లో కడియం కావ్య గారి చేతి గుర్తుకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మండల పార్టీ ముఖ్యనాయకులు, యూత్ నాయకులు, మహిళ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఘనంగా బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు

### హాజరైన ప్రెస్ క్లబ్, ఐజేయూ యూనియన్ అధ్యక్షులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ పాత్రికేయులు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు నల్లాల బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పుట్టిన రోజును పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో జరిగిన వేడుకల్లో బుచ్చిరెడ్డి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే ఐజేయూ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శులు బోల్లారం సదయ్యలు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిజంలో విశేష సేవలందించిన బుచ్చిరెడ్డి మరింతగా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంతోష్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, విష్ణు వర్ధన్, బొడిగె శ్రీనివాస్, పులికంటి రాజేందర్, ఎస్ ఆర్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మ అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ సభను జయప్రదం చేయాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బీజేపీ వరంగల్ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కాంక్షిస్తూ ఈనెల 8న వరంగల్ లో బీజేపీ ఆధ్వర్యంలో 'ఓరుగల్లు జనసభ'ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై ఈ భారీ బహిరంగసభ లో పాల్గొంటున్నారు. బీజేపీ శ్రేణులు, అభిమానులు, యువకులు, రైతులు, మేధావులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ పిలుపునిచ్చారు. సోమవారం తొర్రూరు పట్టణంలో స్థానిక చింతలపల్లి రోడ్డు, రామకృష్ణ థియేటర్ ఏరియాల్లో వివిధ బూత్ కమిటీ అధ్యక్షుల ఆద్వర్యంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ లోక్ సభ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు ఖాయమని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు స్థానికులు కాదని, బీజేపీ అభ్యర్థి ఓరుగల్లు ముద్దు బిడ్డ అరూరి రమేష్ స్థానికుడని, ఆయన గెలిస్తే మోడీ సహకారంతో వరంగల్ లోక్ సభ నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసే సదవకాశం ఉంటుందని తెలిపరు. వరంగల్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజకుమార్, శక్తి కేంద్రం ఇంచార్జి వినయ్ శర్మ, బూత్ కమిటీ అధ్యక్షులు కాగు నవీన్, పప్పుశెట్టి సంతోష్, సోషల్ మీడియా కన్వీనర్ శివ, నాయకులు ఉమేష్, మచ్చ ఉదయ్, నరేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడికి గురవుతున్న గుమస్తాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో కిరాణం అండ్ అనాజు జనరల్ స్టోర్ బట్టలు, షాపింగ్ మాల్స్, మెడికల్ ఏజెన్సీస్, రెడీమేడ్, వెండి, బంగారం, ఐరన్ హార్డ్ వేర్, ఆనియన్ షాపులలో పనిచేస్తున్న గుమస్తాలు, సుమారు 8000 మంది వరకు వివిధ షాపులలో సేల్స్ మెన్, హెల్పర్, వాటర్ బాయ్, వేమెన్, అకౌంటెంట్ పలు కేటగిరీలో పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనం అమలు కావడం లేదని, బోనసు సర్వీసు, ఈఎస్ఐ, పీఎఫ్ పండుగ సెలవులు ఎలాంటివి వర్తించడం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర రామస్వామి లేదన్నారు. గుమస్తా, కార్మికులు షాపులలో పని చేస్తున్నట్లుగా ఎలాంటి గుర్తింపు లేదు. రోజుకు 13 గంటలు పని చేస్తూన్నారు. ఈ రంగంలో రోజురోజుకు పురుష కార్మికులు తక్కువై మహిళా కార్మికులు ఎక్కువ అవుతున్న పరిస్థితి ఉంది. యాజమాన్లు అతి తక్కువ వేతనం ఐదు వేల నుంచి 10 వేల వరకు ఇస్తూ కార్మికుల శ్రమను విపరీతంగా దోచుకుంటున్నారు. పది వేలపై నుంచి రూ.15 వేల వరకు జీతం ఉన్నవారు అతి తక్కువ మంది ఉన్నారు. ఎక్కువ మొత్తంలో మహిళా కార్మికులు ఉన్నారు. పెద్ద మొత్తంలో శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వీరికి 4000/- రూ. 6000/- వేతనాలు తీసుకొని 12 గంటలు పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలు గడుపుతున్నరు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతం పెంచమని అడిగితే యాజమాన్లు నీ ఇష్టం ఉంటే ఉండు లేకుంటే వెళ్లిపో అని మధ్యలోనే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారు. షాపులలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్లు శ్రమను యథేచ్ఛగా దోచుకుంటున్న పరిస్థితి ఉంది. కాబట్టి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేల ఇస్తేనే కార్మికుడి కుటుంబాన్ని పోషించుకొని శ్రమ చేసే పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా కనీస వేతనం అమలు కావాలన్నా, పని భద్రత ఉండాలన్న అడిగే హక్కు కావాలన్నా తప్పనిసరిగా సీఐటీయూ జెండా కింద ఉండి హక్కులను రక్షించుకోవాలని చెబుతున్నారు.



# ప్రతి రైలులో సాధారణ భోగీలను ఐదుకు పెంచాలి

**మద్దతు తెలిపిన జబర్దస్త్ రాజమౌళి, కవి, గాయకుడు బండ వెంకన్న**

**డాక్టర్ పరికిపండ్ల అశోక్**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రతి రైలులో సాధారణ భోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ భోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సాధన సమితి జాతీయ కన్వీనర్, జాతీయఅవార్డు గ్రహీత–డాక్టర్ పరికిపండ్ల అశోక్ దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గోగుల మల్లయ్య బజార్ లో నిర్వహించారు. ఐదు సాధారణ భోగీల సాధన కోసం ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల గాంధీ మార్గంలో ఉద్యమాన్ని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఆగమ్య గోచరంగా ఉంటుందని, సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అశోక్ పరికిపండ్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా– టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్ ,న్యూఢిల్లీ–110011 చిరునామాకు మన బాధను, డిమాండ్ ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని, 100 మందితో రాయించాలని, ఈ విషయాన్ని వందమందికి వాట్సప్ గ్రూపులలో షేర్ చేయాలని, అంతేకాకుండా @PMOIndiaకు ట్విట్టర్ ఖాతాలో ట్వీట్ చేయాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ వర్ధమాన యాక్టర్ రాజమౌళి, కవి గాయకుడు బండ వెంకన్నలు అతిథులుగా పాల్గొని ఉత్తరాలు రాసి పోస్ట్ డబ్బాలో వేసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్ లతో పాటు చైల్డ్ లైన్, చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది సమ్మయ్య, సరోజ, ప్రవీణ్, మసూద్ సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు

## కడియం కావ్యకే 'పోపా' మద్దతు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లోక్ సభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కడియం కావ్యకు సంపూర్ణ మద్ధతు పద్మశాలి ఆఫిషల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సోమవారం శివనగర్ పోపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ, పద్మశాలిల కులవృత్తి, చేనేతకు బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు మోసం చేశాయని, కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, కొండా దంపతుల నాయకత్వంలో మెజారిటీ చూపించాలని, పద్మశాలి సత్తా చాటాలని కొరారు. ఈ కార్యక్రమంలో పోపా రాష్ట్ర నాయకులు గోషికొండ సుధాకర్, ధర్మపురి రాజగోవిందు, సింగం కుమార్, పెద్దూరి పెద్దన్న, కిరణ్, రాజు, అశోక్ కుమార్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

## బీజేపీ ముమ్మర ప్రచారం



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోనీ ఊరుగొండ గ్రామంలో పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, శక్తి కేంద్ర ఇంచార్జి గొగుల సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఊరుగొండ పెద్ద చెరువులో ఉపాధి హామీ కూలీలను కలిసి మజ్జిగ ప్యాకెట్లు, అరటి పండ్లు పంపిణీ చేసి వరంగల్ లోక్ సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, సీనియర్ నాయకులు వీసం రమణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ పవడాల మధుకర్, బీజేవైఎం మండల సోషల్ మీడియా కన్వీనర్ ముత్యాల రాజశేఖర్ గౌడ్, దాంసాని మనోజ్ రెడ్డి, గునిశెట్టి శివ, చేల్పూరి శ్రీను, బూతు 109 అధ్యక్షుడు చెల్పూరి రాజు, 110 అధ్యక్షులు సాంబారు చరణ్, చెల్పూరి శ్రీను, 111 అధ్యక్షులు గండు అన్వేష్ గౌడ్, దుర్గంపేట శక్తి కేంద్రీ ఇంచార్జి గండు పరశురాం, 113 బూత్ అధ్యక్షులు నూకల రవీందర్, గండు ముఖేష్ గౌడ్, దండు రాజు గౌడ్, కొనిశెట్టి శివ, ముత్యాల ఉమేష్, నూకల నాగరాజు, సాంబారు విఘ్నేష్, మాడుగుల వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లూపస్ వ్యాధిపై ఉచిత అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక అపెక్స్ హాస్పిటల్ లో డాక్టర్"విఘ్నేష్ ఎండీ డీఎం(రుమాటోలజిస్ట్) కీళ్ల వ్యాధి నిపుణుల ఆధ్వర్యంలో సోమవారం లూపస్ వ్యాధిగ్రస్తులకు ప్రదర్శన శాలతో కూడిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. విఘ్నేష్ మాట్లాడుతూ కీళ్లవాతాలలో ఒక రకమైన లూపస్ వ్యాధిని అదుపులో ఉంచుకుంటూ, ఇతర వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా ఈ అవగాహనకార్యక్రమం ఎంతగానో తొడ్పాడుతుందని తెలిపారు. ఇందుకోసం మేము ప్రతి సంవత్సరం లూపస్ డే సందర్భంగా మే మొదటి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు కీళ్ళ నొప్పులు, వాపులు, జుట్టు ఎక్కువగా రాలడం ముఖం మీద సీతకొక చిలుక ఆకృతిలో ఎర్రటి మచ్చలు, జ్వరం, అలసట ఇటువంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే కీళ్ల వైద్య నిపుణులు(రుమటాలజిస్ట్)ను సంప్రదించాలని, చికిత్స ఆలస్యం అయితే ఈ వ్యాధి శరీరంలోని ఇతర అవయవాలకు వ్యాపించే అవకాశం ఉందని చెప్పారు. ప్రదర్శనశాలతో కూడిన ఈ అవగాహన కార్యక్రమం మాకు ఎంతగానో ఉపయోగ పడుతుందని, అపెక్స్ హాస్పిటల్ యాజమాన్యానికి డా"విఘ్నేష్ మా కోసం ఈ కార్యక్రమన్ని నిర్వహించడానికి ఎంతగానో కృషి చేశ్శారని లూపస్ వ్యాధి పేషెంట్స్ తెలిపారు

## మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పరీక్ష కేంద్రాలు, ఆస్పత్రుల్లో చల్లని మజ్జిగ, మంచినీళ్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్ ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి ఉష్ణగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నందున ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నేటి నుంచి విద్యార్థులకు డిగ్రీ పరీక్షలు ఉన్నాయని, ఆస్పత్రులకు అనేక మంది పేదలు వైద్యం కోసం వస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, రోగుల కోసం ప్రభుత్వం చల్లని మజ్జిగ, మంచినీళ్లు ఏర్పాటు చేయాలని, వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో ప్రథమ చికిత్స కేంద్రంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎండలు మండుతున్నందున విద్యార్థులు, యువత అవసరం ఉంటేనే బయటకు రావాలని, వడదెబ్బకు గురి కాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆదేశానుసారం 22వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మవురాపు గీత విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ లోక్ సభ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శివ, ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## విలువైన ఓటును వృథా చెయొద్దు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తమ వంతు బాధ్యతగా మేము 13న జరగనున్న లోకసభ ఎన్నికల రోజు తప్పకుండా ఓటు వేయడమే కాక మా వాహనాలలో ప్రయాణించే ప్రయాణికులకు తప్పక ఓటేయమని చెబుతామంటూ హనుమకొండ హౌసింగ్ బోర్డ్ కాలనీ ట్రావెల్ ఏజెన్సీ యజమానులు, డ్రైవర్లు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ప్రముఖ సామాజికవేత్త ఓటర్ చైతన్య పోరాటయోధుడు నిమ్మల శ్రీనివాస్ సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఎంతో విలువైన ఓటును వృథా చేయకుండా బాధ్యతగా ప్రతి ఒక్కరు తప్పకుండా ఎన్నికల రోజు కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారితో కలిసి ఓటు వేయాలని కోరారు. అనంతరం ఓటరు నినాదాలతో కూడిన ప్లకార్ట్స్ ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జంపాల జనార్ధన్, గుగులోతు రామోజీ, కిషన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాషాయ జెండా ఎగరడం పక్కా

**కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓరుగల్లు గడ్డ పై కమలం జెండా ఎగరవేయడం పక్కా అని 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 60వ డివిజన్ వడ్డేపల్లి ముదిరాజ్ వాడలో స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ ప్రచారం చేశారు. నరేంద్రమోడీ నాయకత్వంలో జరిగిన మార్పులు గమనించి బీజేపీకి ఓటు వేసి అరూరి రమేష్‌ను భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజలను అభ్యర్ధించారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి రాజి రెడ్డి, రామరాజు, యాదగిరి, ప్రవీణ్, సాగర్ గౌడ్, నరేష్, రమేష్, బాబీ, చందు, సంతోష్, కందికొండ రాజు, మట్టేపల్లి రాజు, సన్నీ, అరవింద్, జగదీష్, రాము, మహిళ మోర్చా అధ్యక్షురాలు వనా దేవి, వనిత, మౌనిక, నిరిష, శ్రుతి, బూత్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మా అమ్మని గెలిపించండి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపు కోరుతూ మహబూబాబాద్ మున్సిపాలిటి పరిధిలోని 9వ వార్డులో కవిత కూతురు మహతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మా అమ్మకు ఓటేసి గెలిపించాలని ప్రజలకు కోరారు.

# రేపు సీఎం రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ప్రచార కార్యక్రమంలో రేపు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జరిగే ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్నందున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రేవంతన్న అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా అధికార ప్రతినిధి రావుల వెంకట రమేష్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ లోక్ సభ ఎన్నికల సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం ప్రచార కార్యక్రమంలో రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అనంతరం హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి హనుమకొండ చౌరస్తాలో జరిగే కార్నర్ మీటింగ్ లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని తిలకించడానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** లోక్ సభ ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఆత్మకూరు మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బలవంతుల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల కోఆర్డినేటర్ మేకల రాజా వీర, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మే 13న జరగబోయేటువంటి లోక్ సభ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ కు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే 8న జరగబోయే భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా విచ్చేయుచున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభ విజయవంతం కోసం జన సమీకరణ కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ శ్రవణ్ కుమార్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సముద్రాల రవి, బీజేవైఎం అధికార ప్రతినిధి సాయి కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు గట్టు వేణు, మండల కార్యదర్శులు రవ్వ శివప్రసాద్, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 40వ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రచారం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 40వ డివిజన్ 9వ బ్లాక్ ఇంచార్జి దాసి రాందేవ్ నాయకత్వంలో కొండా దంపతుల ఆదేశానుసారం కడియం కావ్య గెలుపు కోసం ప్రచారం చేశారు. అంకం మల్లికాంబ, విజయ, స్వప్న, అరుణ, కవిత, బత్తిని నరేందర్, లచ్చిబాబు, వైకుంఠం, గోపి, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను దగా చేసిన బీజేపీని ఓడిద్దాం

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్తంగా బీసీల ఉద్యమాలను పట్టించుకోకుండా గత పదేళ్లుగా బీసీలను దగా చేసిన బీజేపీని లోక్ సభ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి బలపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. బీసీల కుల గణన జరగాలని బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి వారి అభివృద్ధికి సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. బీసీ సంఘాలు చేసిన పోరాటాలను బీసీ ప్రధానమంత్రి అని చెప్పుకునే నరేంద్ర మోదీప్రభుత్వం పట్టించుకోకపోవడం బీసీల ఎడల వారికున్నచిత్తశుద్ధి ఏమిటోతెలుస్తున్నదన్నారు. కుల గణన నిర్వహణను ,దేశజనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల డిమాండ్స్ ను వ్యతిరేకిస్తున్న మోదీ పాలనకు చరమ గీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగాన్ని, లౌకికప్రజాస్వామ్యాన్ని, బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కాపాడుకునేందుకు ఇండియా కూటమి బలపరుస్తున్నకాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని వెంకట్రాములు ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి




### గాంధీ ట్రస్ట్ కోఆర్డినేటర్ పరికిపండ్ల వేణు

**వరంగల్ వాయిస్, నయింనగర్ :** ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని గాంధీ చారిటబుల్ ట్రస్ట్ వరంగల్ కోఆర్డినేటర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు అన్నారు. మహాత్మా గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఓటు హక్కు వినియోగ చైతన్యంపై నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదర్శ కాలనీలో జరిగిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ' ఓటు ' మనిషి అస్తిత్వానికి ప్రతీక, భారత రాజ్యాంగం దేశంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందని తెలిపారు. ఇది మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది కాబట్టి, ప్రతి ఒక్కరూ ఓటింగ్ రోజు నిర్లక్ష్యం వహించకుండా ఓటు హక్కును వినియోగించుకొని అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవ సలహాదారు ఇమ్మనేని సుందర్ రావు మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా నిస్వార్థంగా ఓటును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తూడి విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఓటర్లు దుర్వినియోగం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ ట్రస్ట్ సభ్యులు, కాలనీవాసులు పున్నం శ్రీను, సరోత్తంరెడ్డి, బాలునాయక్, శ్యాంసుందర్ రెడ్డి, జగదీశ్వర్, గోపాల్, వెంకట్ రెడ్డి, లడే శ్రీను, మోహన్ రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు జనసభను విజయవంతం చేద్దాం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా 21వ డివిజన్ సమావేశం సోమవారం డివిజన్ అధ్యక్షుడు కోమకుల నాగరాజు అధ్యక్షతన స్వర్ణ ప్యాలెస్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. బుధవారం ఉదయం 10.00 గంటలకు మామునూరు ఎయిర్ పోర్టు ఎదురుగా లక్ష్మీపూర్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే బహిరంగా సభను విజయవంతం చేయాలని ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర నాయకులు సముద్రాల పరమేశ్వర్ మాట్లాడారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్ అనే నినాదంతో భారతదేశాన్ని విశ్వ గురు స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న నరేంద్ర మోదీ లోక్ సభ అభ్యర్థి ఆరూరి రమేష్ విజయాన్ని ఆకాంక్షిస్తూ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించే సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. అలాగే 21 డివిజన్ లోని మేధావులు, విద్యావేత్తలు, వ్యాపారస్తులు, ముఖ్యంగా యువత, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, ఓబీసీ మోర్చా బైరి మురళీకృష్ణ, సిద్ధోజు శ్రీనివాస్, యువ మోర్చా అపురూప రాజనీష్, సోషల్ మీడియా నోముల రతన్, కందుకూరి శ్రీనివాస్, వల్లందాసు రవీందర్, వంగరి ప్రదీప్, గుడికందుల జగన్, మామిడాల సురేష్, బండి కృష్ణంరాజు, గాదె భిక్షపతి, గుర్రపు రవి పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో శ్రీ ఏకాదశ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని సోమవారం గుడి ఆవరణంలో ఆలయ కమిటీ చైర్మన్ భాషని సూర్య ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ నెల 10 నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృప పొందాలని కోరారు. మండల కేంద్రంలో శివ కేశవుల ప్రతిష్ఠ జరిగిన సంవత్స రం లోపు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆగమ శాస్త్ర పద్ధతిని అనుసరించి కర్ణనాది ప్రతిష్ఠాంతం, ఉత్సవాంతం అను ప్రమాణం మేరకు ప్రతిష్ఠ జరిగి దశమ సంవత్సరాలు అవుతున్న సందర్భంలో వైశాఖ శుద్ధ తదియ శుక్రవారం ఈ నెల 10 నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కార్యక్రమాలు ఈనెల 10న అంకురార్పణ, 11న గణపతి పూజ, పుణ్యా హవాచనం, రుత్విగ్వరణం, అగ్నిస్థాపన, బేరీతాడనం, ధ్వజారోహణం, మండల దేవతాపూజనం, ఎదుర్కోలు, 12న పంచామృత అభిషేకాలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, పర్వత వర్ధిని సమేత శివ మార్కండేయ స్వామి కళ్యాణ మహోత్సవాలు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న షష్టి సుదర్శన హోమం, చండీ హోమం, పూర్ణాహుతి, ధ్వజవరోహణం, ఉత్సవ పరిసమాప్తి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, వెంకటేశ్వర్లు, వనం సదానందం భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ గ్రామ కార్యదర్శి మృతి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండల కేంద్రంలో కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న నాగపురి మహేష్ గౌడ్ ఆదివారం మధ్యాహ్నం ఉనికిచర్ల ఎస్ ఆర్పీఎస్ స్కూల్ దగ్గరలో ప్రమాదవశా కల్వర్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోలీసులు పంచనామా నిర్వహించి ఎంజీఎంకు తరలించారు.

## వేతనాలు వెంటనే చెల్లించాలి

### రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న 17,514 ఉద్యోగులందరికీ మార్చి, ఏప్రిల్ 2024 వేతనాలు వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. అలాగే ఏడు నెలలు పీఆర్సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ ప్రతి నెల 5న వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని, ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా ప్రక్షాళన చేసి రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# నేను నిఖార్సైన తెలంగాణ ఉద్యమ బిడ్డను

## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వరంగల్ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని పలు డివిజన్ల భారత రాష్ట్ర సమితి బూత్ స్థాయి సమావేశం మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ హాజరై మాట్లాడుతూ నేను నిఖార్సైన తెలంగాణ ఉద్యమ బిడ్డనని, నేను పుట్టింది, పెరిగింది, నా విద్యాభ్యాసం వరంగల్ లోనే అని అన్నారు. నన్ను నాన్ లోకల్ అనేవాళ్లకు సవాల్ విసురుతున్న నేను నా బర్త్ సర్టిఫికేట్ ను తీసుకు వస్తా.. మీరు మీ బర్త్ సర్టిఫికేట్ తీసుకురండని సవాల్ విసిరారు. పది సంవత్సరాలు పదవులు అనుభవించిన ఇప్పటి కాంగ్రెస్,బీజేపీ అభ్యర్థులు వరంగల్ ప్రజల్ని ఎన్ని ఇబ్బందులకు గురి చేసింద్రో అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. కార్యకర్తలు అధైర్య పడొద్దు.. తప్పక మనమే గెలుస్తాం..ఎవరైనా పోలీసులు అక్రమంగా ఇబ్బందులకు గురి చేస్తే తనకు సమాచారం ఇవ్వాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి పై చర్యలు తీసుకునేవిధంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. పార్టీని మోసం చేసి అధికార దాహంతో అడ్డదారులు తొక్కి పార్టీలు మారిన వ్యక్తులకు ఈ ఎన్నిక గుణ పాఠమవ్వాలని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి వెళ్లి కేసీఆర్ ఇచ్చిన సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. తన గెలుపు వరంగల్ లో ఒక చారిత్రాత్మకంగా నిలిచి పోతుందన్నారు. పార్లమెంట్ లో అడుగు పెట్టే అవకాశం రేపు మీ అందరి ఆశీర్వాదం తో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవా రెడ్డి, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ ,ఆవాల రాధికారెడ్డి, హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షులు బండి, రైతు బంధు సమితి మాజీ కన్వీనర్ ఆకుల లలిత యాదవ్, రజిని, తెలంగాణ ఉద్యమ కారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసిస్ట్‌లకు త్వరలోనే మంచి వేతనాలు

## స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీ సమావేశం సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కాన్ఫరెన్స్ హల్ లో హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అథితిగా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ హాజరై మాట్లాడుతూ 2వ పీఆర్సీ కమిటీకి చక్కని రిప్రజెంటేషన్ ఇచ్చామని తెలిపారు. గత 35 ఏళ్లుగా పీఆర్సీలలో మాకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని, తమ విద్యార్హతలు, విధులు పరిగణలోకి తీసుకుని మాకు న్యాయం చేయాలని చక్కగా నివేదించడం జరిగిందన్నారు. పీఆర్సీ కమిటీ అధికారులు కూడా సానుకూలంగా స్పందించి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఫార్మసిస్టులకు త్వరలోనే మంచి జీతభత్యాలు వస్తాయని ఆశిస్తున్నామని, అలాగే ప్రభుత్వం నుంచి త్వరలోనే ఫార్మసీ ఆఫీసర్ గా గెజిట్ ద్వారా ఉత్తర్వులు రావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఫార్మసిస్టులందరికి ప్రమోషన్లు రావడానికి కృషి చేస్తున్నామని, ఆర్ బీఎస్ కే, యూపీహెచ్ సీ,104, ఎన్.హెచ్ఎం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఆయూష్, వివిధ ఏజెన్సీ ల ద్వారా పనిచేస్తున్న ఫార్మసిస్ట్ లందరికి రెగ్యులర్ వారికీ ఇస్తున్న విధంగా బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జాప్యం లేకుండా ప్రతీ నెల 1న జీతాలు ఇవ్వాలని కోరారు. ఫార్మసిస్ట్స్ అందరినీ రెగ్యులర్ చేయుటకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ను, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, వరంగల్ జిల్లా కార్యదర్శి ఆడుప వెంకట రమణ లను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశం లో వరంగల్ జిల్లా అధ్యక్షుడు దేవం భట్ల ప్రకాష్ రావు, వరంగల్ జిల్లా కార్య దర్శి వెంకట రమణ, హనుమకొండ జిల్లా కార్య దర్శి సుధాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అవినాష్, అసోసియేషన్ నాయకులు నార్ల వేణు, సూరయ్య, విజయలక్ష్మి, ఝాన్సీలక్ష్మి , శ్రీదేవి, సునీత, జి.సతీష్, సంతోష్, సతీష్, అనిల్, నీలిమ దేవి, సూర విజయ, అన్వేష్, అనూష, అనిత, మమత, సుభాషిణి, వెంకన్న, సృజన, సరళా రాణి, సుధారాణి, విజేత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ సాధించిన కేసీఆర్ కు మాత్రమే తెలంగాణ అభివృద్ధి పట్ల, అణగారిన వర్గాల, పేద వర్గాల ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉందని, కేసీఆర్ కి తప్ప మరే నాయకుడు తెలంగాణ కోసం పరితపించలేరని అందుకే, బీఆర్ఎస్ వరంగల్ లోక్ సభ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ కు మద్దతు పలికామని, అతడి గెలుపు కోసం కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన వీరోచిత పోరాటంలో లాఠీ దెబ్బలు తిని, కేసుల పాలై జైలు జీవితాన్ని అనుభవించి ప్రాణాలకు తెగించి కేసీఆర్ మాత్రమే తెలంగాణ సాధించగలిగారని అన్నారు. సాధించుకున్న తెలంగాణను తన చేతులతో అద్భుతమైన అభివృద్ధికి చిహ్నంగా రూపు దిద్దాడని చెప్పారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, అమరవీరుల స్మారక చిహ్నం దానితోపాటు పచ్చని పంట, గలగల పారే నదులు సుభిక్షంగా ఉన్న తెలంగాణ కేసీఆర్ ఆకాంక్షించారని తెలిపారు. అట్లాంటి తెలంగాణ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఈదునూరి యాకన్న, యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెడ స్వామి, రాష్ట్ర నాయకులు బొచ్చు మురళి, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కేయూ ఇంచార్జ్ ధర్మారపు శ్రీకాంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య, జనగాం జిల్లా అధ్యక్షుడు ఇరుగు యాకయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బక్కి రవి, మహేష్, జిల్లా నాయకులు జన్ను సంజీవ్, ప్రతాప్, మంద రాజశేఖర్, సురేందర్, గోల్కొండ శ్రీనివాస్, మసుదాన్, దయాకర్, జయరాజ్, విజయకాంత్, రాజశేఖర్, విజయకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరిస్తాం

## మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శివనగర్ లోని కేపీఎస్ ఫంక్షన్ హాల్ లో ఖిలా వరంగల్ మండల, వరంగల్ మండల, సిటీ అసోసియేషన్ గ్రామ వైద్యుల ఉమ్మడి ఆత్మీయ సమ్మేళనం సమావేశం సోమవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా అటవీ, పర్యాటక, దేవా దాయశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సమావేశం మామిడి ఈశ్వరయ్య అధ్యక్షతన జరగగా ఆర్ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులను మంత్రికి వివరించారు. మేము మా పరిధిలో వైద్యం చేస్తున్నాం. కాబట్టి, తమపై ఏ విధమైన దాడులు జరగకుండా చూడాలని కోరారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆర్ఎంపీలపై దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఆర్ఎంపీలపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆర్ఎంపీ భవన్ కు ల్యాండ్ కోసం కలెక్టర్ కు సిఫార్సు చేశానని తెలిపారు. డాక్టర్ కడియం కావ్య ఉన్నత విద్యావంతురాలు, పైగా డాక్టర్ కాబట్టి, డాక్టర్ గా మీ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఆమెకు ఉందన్నారు.మే 13న జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి ఈ వృత్తినే ఎంచుకొని జీవన సాగిస్తున్న మేము ప్రస్తుత పరిస్థితిలో మాపై దాడులను చేస్తోరీ మానసికంగా బాధకు గురి చేయవద్దన్నారు. బుద్దె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తక్కువ ఖర్చుతో మాకు చేతనైన వైద్యం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్, నరేంద్ర శ్రీనివాస్, రాజమౌళి, జ్ఞానేశ్వర్, భాస్కర్, మోహన్ తదితర వైద్యులు 200 మంది పాల్గొన్నారు.

# బలరాంనాయక్ గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మహబూబాబాద్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు ఖాయమని చెన్నారావుపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాపురం మాజీ సర్పంచ్ తప్పేట రమేష్ అన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోనీ ఉప్పరపెల్లి గ్రామంలో ఇంటి ఇంటికి ప్రచారం నిర్వహించి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో పాటు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రజలకు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టి అభ్యర్థి బలరాంనాయక్ గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపెల్లి గ్రామ పార్టి అధ్యక్షులు వట్టే తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ అందె వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ బల్గురి నరేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కాసాని రమేష్, సీనియర్ నాయకులు సుదన్ రెడ్డి, వట్టే శ్రీనివాస్ రెడ్డి, గుళ్లపెల్లి రమేష్, కత్తి సాంబయ్య, దొనకొండ కర్ణాకర్ రెడ్డి, బీరం సాంబరెడ్డి, సమ్మెట భిక్షపతి, ఎండీ యాకుబ్, బొమ్మెర కొమ్మాలు, కాసాని బాబు, గుళ్లపెల్లి స్వామి, పులి సారయ్య, కుంట తిరుపతి, కుక్కల ఆగయ్య, కుక్కల రజినీకాంత్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్‌లో తీవ్ర విషాదం

**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామస్తుల సమాచారం ప్రకారం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన గాజ కుమార్ స్వామి (45) కూతురు శ్రీవిద్య (19)ను చదువు విషయంపై మందలించడంతో తీవ్ర మన స్థాపానికి గురైన శ్రీవిద్య క్రిమిసంహారక మందు తాగడంతో తండ్రి కూడా ఆవేశంలో క్రిమిసంహారక మందు తాగి మృతి చెందాడు. కూతురు శ్రీవిద్యను పరకాలలోని ఒక ప్రైవేట్ హాస్పటల్ తరలించడం జరిగిందని కూతురు పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.








# ఈ యేడు బడా సినిమాల సందడి

## లైన్‌లో కల్కి, పుష్ప, దేవర, గేమ్ ఛేంజర్‌లు

ఈ సంవత్సరం నాలుగు పెద్ద సినిమాలు విడుదల కానున్నాయి. అవి ఒక్క తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లో కూడా విడుదలవుతున్నాయి. ఈ నాలుగు సినిమాల్లో రెండు సినిమాలు విడుదల తేదీలు, ప్రచారాలు అప్పుడే మొదలు పెట్టేసారు. ఇంకో రెండు సినిమాలు ఇంకా చిత్రీకరణ దశలోనే వున్నాయి, కానీ ఆ రెండు సినిమాలు కూడా ఈ సంవత్సరమే విడుదలవుతున్నాయి. ఈ నాలుగు సినిమాలకి పెట్టిన బ్జడెట్ వీటిపై వచ్చే వ్యాపారాలు సుమారు రూ. రెండువేల కోట్లకి పైగా ఉంటుందని ట్రేడ్ విశ్లేషకుల అభిప్రాయం. ఇంతకీ ఈ నాలుగు సినిమాలు ఏవంటే, ముందుగా జూన్ 27 న విడుదలవుతున్న ’కల్కి 2898 ఏడి’. ఇందులో ప్రభాస్ కథానాయకుడు కాగా, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, ఇంకా చాలామంది నటీనటులు వున్నారు. ఇది ఒక సైన్స్ ఫిక్షన్ కథ అని చెపుతున్నారు. నాగ్ అశ్విన్ దర్శకుడు కాగా, అశ్విని దత్ నిర్మాత. ఈ సినిమాకి సుమారు రూ. 600 కోట్లు బడ్జెట్ అయిందని వార్తలు వస్తున్నాయి. ఇక రెండో సినిమా ’పుష్ప 2: ది రూల్’. ఇది ఆగస్టు 15న విడుదలవుతోంది. అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ సినిమాకి సుకుమార్ దర్శకుడు. ఇది ’పుష్ప: ది రైజ్’ అనే సినిమాకి సీక్వెల్ గా అంటే రెండో భాగంగా వస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలు వున్నాయి. ఈ సినిమా ఓటిటి హక్కులు నెట్ ఫ్లిక్స్ ఇప్పటికే రూ.275 కోట్లకి తీసుకుందని వార్తలు వచ్చాయి. అలాగే ఈ సినిమా హిందీ హక్కులు అనిల్ తడాని రూ. 200 కోట్లకు తీసుకున్నారని ఇంకో వార్త కూడా వచ్చింది. ఈ సినిమా మొదటి భాగం హిందీలో సుమారు రూ.125 కోట్ల వ్యాపారం చేసింది కాబట్టి, ఇప్పుడు రెండో భాగం అంతకన్నా ఎక్కువ చేస్తుందని నమ్ముతున్నారు. మూడో సినిమా జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న ’దేవర’ సినిమా. బాలీవుడ్ నటి, శ్రీదేవి బోనీ కపూర్ ల కుమార్తె జాన్వీ కపూర్ ఇందులో కథానాయిక. కొరటాల శివ దర్శకుడు. ఈ సినిమా రెండు భాగాలుగా వస్తోంది, ఇందులో మొదటి భాగం ముందుగా అనుకున్న తేదీ ప్రకారం అయితే ఈపాటికి విడుదలైపోవాలి, కానీ కొన్ని అనివార్య కారణాల వలన ఈ సినిమా విడుదల దసరా పండగ సందర్భంగా అక్టోబర్ 10 కి వాయిదా వేశారు. ఆర్‌ఆర్‌ఆర్’ సినిమా తరువాత ఎన్టీఆర్ చేస్తున్న పాన్ ఇండియా సినిమా ఇదే. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఇందులో ప్రతినాయకుడి పాత్ర పోహిస్తున్నారు. ఈ సినిమా విడుదలకి ఇంకా చాలా సమయం వున్నా, ఇది ఎన్టీఆర్ కి ఒక ప్రతిష్టాత్మక చిత్రంగా వుండబోతోంది. తెలుగులో కాకుండా పాన్ ఇండియా లెవెల్లో అతని స్టామినా ఏంటో ఈ సినిమా ద్వారా నిరూపితం అవుతుంది కాబట్టి, ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇక నాలుగో సినిమా రామ్ చరణ్, దర్శకుడు శంకర్ ల కలయికలో వస్తున్న ’గేమ్ చేంజర్’. ఈ సినిమా విడుదల తేదీ ఇంకా ప్రకటించలేదు, కానీ ఈ సంవత్సరమే విడుదలవుతుందని మాత్రం అంటున్నారు. ఈ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టి రెండు సంవత్సరాలకి పైగా అవుతున్నా ఇంకా జరుగుతూనే వుంది. ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయిక, కాగా ఈ సినిమాలో అంజలి, జయరాం, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సముద్రఖని, నవీన్ చంద్ర, సునీల్ ఇలా చాలామంది నటీనటులు వున్నారు. శంకర్ ఈ సినిమాతోపాటుగా కమల్ హాసన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ’భారతీయుడు 2’ సినిమాకూడా చిత్రీకరణ చెయ్యాల్సి రావటంవలన ఈ సినిమా చిత్రీకరణలో జాప్యం జరిగింది అని అంటున్నారు. ఈ సినిమాకి నిర్మాత దిల్ రాజు, అతని నిర్మాణంలో చిత్రీకరణ కోసం చాలా ఎక్కువ సమయం తీసుకున్న సినిమా ఈ ’గేమ్ చేంజర్’ మాత్రమే అని అంటున్నారు. ఈ సినిమా బ్జడెట్ సుమారు రూ.300 కోట్లు ఉండొచ్చు అని అంచనా వేస్తున్నారు. ఈ సినిమా వ్యాపారం ఇంకా ముగియలేదని, ఈ సినిమా విడుదల తేదీ ఖరారైతే అప్పుడు వ్యాపారలావాదేవీలు పూర్తవచ్చు అని అంటున్నారు. ఈ నాలుగు పెద్ద సినిమాలు ఈ సంవత్సరమే విడుదలవుతున్నాయి, ఈ సినిమాలపై వేలకోట్ల రూపాయల వ్యాపారం జరగబోతోంది. అలాగే పరిశ్రమ మనుగడ కూడా ఈ నాలుగు సినిమాలపై వుంది.





# నవదీప్ యేవమ్

## ఫస్ట్ లుక్ విడుదల

యువ నటుడు నవదీప్ తన సొంత నిర్మాణ సంస్థ సి–స్పేస్ ప్రొడక్షన్స్ పతాకంపై ’యేవమ్’ అనే సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. చాందిని చౌదరి ప్రధాన పాత్రలో వస్తున్న ఈ చిత్రంలో వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రకాష్ దంతులూరి దర్శకత్వం వహిస్తుండగా.. నవదీప్, పవన్ గోపరాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి చాందిని చౌదరి ఫస్ట్ లుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ‘ఆడపిల్లనే! ఐతే ఏంటంట?‘ అంటూ పోలీసుగా సీరియస్ లుక్‌లో చాందిని ఉండగా.. మహిళా సాధికారికతను చాటి చెప్పే విధంగా చాందిని పాత్ర ఈ చిత్రంలో కనిపించనుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి మరో కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నా బాడీ సూపర్ డీలక్స్ అంటూ ఈ పోస్టర్ ఉండగా.. హారిక అనే బోల్డ్ పాత్రలో అషు రెడ్డి నటించబోతున్నట్లు తెలుస్తుంది. చాందిని చౌదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి, గోపరాజు రమణ, దేవిప్రసాద్, కల్పిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్క్ష్మ ఎస్వీ విశ్వేశ్వర్, సంగీతం కీర్తన శేషు, నీలేష్ మందలపు అందిస్తున్నారు. సుజనా అడుసుమిల్లి ఎడిటర్‌గా, రాజు పెన్మెత్స ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



# తలైవా జీవితం ఆధారంగా చిత్రం

అభిమాన హీరోను తెరపై చూస్తే ఫ్యాన్స్ ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఇక వారు చేసే యాక్షన్ వెండితెరపై ఆవిష్కరించ చేస్తే ఆనందంలో మునిగి తేలుతుంటారు ప్రేక్షకులు. తాము అభిమానించే హీరో జీవితం తెరపైకి వస్తే సినీ ప్రియులకు పండగే. బాలీవుడ్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలతో దర్శకనిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్న సాజిద్ నదియావాలా అలాంటి ప్రయత్నంలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆయన తమిళ అగ్ర నటుడు అగ్ర కథానాయకుడు రజనీకాంత్ బయోపిక్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ’సాజిద్ కేవలం రజనీకాంత్ నటనకు మాత్రమే కాదు. ఆయన వ్యక్తిత్వానికి కూడా వీరాభిమానులుంటారు. ఆయన చేసే సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం. అయితే ఆయన గురించి పూర్తి విషయాలు ఎవరికీ తెలియదు. అందుకే ఆయన జీవితాన్ని తెరపై చూపించాలని సాజిద్ నిర్ణయించు కున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్ వరకూ ఆయన ఎలా ఎదిగారు, ఎక్కే ఒక్కో మెట్టులో ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు అన్నది సినిమాగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ఈ కథపై చర్చలు చేస్తునట్లు, ఆయన కుటుంబంతో చర్చలు జరుపుతున్నారని‘ అని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ పనులు కూడా మొదలయ్యాయట.గతేడాది ’జైలర్’తో భారీ విజయం అందుకున్నా తలైవా ఈ ఏడాది తన కూతురు దర్శకత్వంలో వచ్చిన లాల్ సలామ్ చిత్రంతో పరాజయాన్ని చవిచూశారు. ప్రస్తుతం ఆయన వేట్టయాన్’ చిత్రంతో బిజీగా ఉన్నారు. టి.జె జ్ఞానవేల్ ఈ చిత్రానికి దర్శకుడు. తదుపరి లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ’తలైవర్171’ చిత్రం చేయనున్నారు.





# ఆనందమయ జీవితాలకు చిరునామా.. పల్లెటూళ్లు

కరెంట్ లేదు..టీవీ లేదు.. ఏసీ లేదు.. గ్యాస్ లేదు.. ఇంటి అద్దెలు లేవు.. కరెంటు బిల్లులు లేవు.. నీళ్ల బిల్లులు లేవు.. ఇంటి పన్నులు లేవు. ఏమీ లేనప్పటికీ పెదవుల్లో చిరునవ్వు ఇసుమంతైనా తగ్గలేదు. ? ఇంతకు మించిన ఆనందం ఈ ప్రపంచంలో మరెక్కడ లభిస్తుంది. కోట్లుపెట్టినా దొరకని ఆనందం మన పల్లెటూళ్లలో దొరుకుతుంది. – వరంగల్ వాయిస్ డెస్క్




# ట్రాన్స్‌జెండర్లు శక్తి స్వరూపులు

**వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి**

ట్రాన్స్‌జెండర్లు శక్తి స్వరూపులలని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అభిప్రాయపడ్డారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ట్రాన్స్ జెండర్ లకు ఓటు అవగాహనపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల ప్రచార కర్త, ట్రాన్స్ జెండర్ రాష్ట్ర అధ్యక్షురాలు లైలాతో కలిసి అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. **- వరంగల్ వాయిస్, వరంగల్**

# బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు అడిగే హక్కు లేదు

**పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపాం**

**మీట్ ది ప్రెస్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి పది సంవత్సరాలపాటు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్య క్రమంలో పాల్గొన్న మారపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విధ్వంసం చేశాయని మండిపడ్డారు. ఇక్కడ ఎలాంటి పారిశ్రామిక అభివృద్ధి లేకుండా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను మూసి వేశారని ధ్వజమెత్తారు. గతంలో ఇక్కడ ఉన్న అజం జాహి మిల్లు, తోలు పరిశ్రమల మనుగడ లేకుండా పోయిందన్నారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటును బీజేపీ, కాంగ్రెస్ లు అడ్డుకున్నాయన్నారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ చేసి పెట్టుబడి దారుల చేతిలో పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. దేశంలో మోడీ పాలనలో ప్రజలు విసిగి పోయారన్నారు. తల్లి లాంటి పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరి, ఆరురి రమేష్ లకు వరంగల్ ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెబుతారన్నారు. దేశంలో తప్పకుండా మార్పు రావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే అన్నారు. ప్రాంతీయ పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. ఓరుగల్లు గడ్డపై తెలంగాణ రాష్ట్ర సమితి జెండాను ఎగుర వేస్తానన్నారు.

# రేపు నామినేషన్ వేయనున్న రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డి మంగళవారం నల్లగొండలో నామినేషన్ దాఖలు చేయనున్నాను. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ రోడ్ లోని లక్ష్మీ గార్డెన్స్ నుంచి కలెక్టరేట్ కార్యాలయానికి ర్యాలీ బయలుదేరుతుందన్నారు. ఈ ర్యాలీలో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రులు, మాజీ శాసనసభ్యులు, జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, గ్రాడ్యుయేట్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు.

# 8న నగరానికి ప్రధాని మోడీ

**ఓరుగల్లు జన సభను విజయవంతం చేద్దాం**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 8న ప్రధాని నరేంద్ర మోడీ నగరానికి వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. ఆ పార్టీ వరంగల్ తూర్పు నియోజక వర్గ సమావేశం సోమవారం ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు మామునూరు ఎయిర్ పోర్టు ఎదురుగానున్న లక్ష్మీపూర్ గ్రామ పరిధిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రధాని పాల్గొననున్నట్లు వెల్లడించారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్ అనే నినాదంతో భారతదేశాన్ని విశ్వ గురు స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న బహిరంగ సభకు తూర్పు నియోజక వర్గంలోని మేధావులు, విద్యావేత్తలు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై నరేంద్ర మోడీకి ఘన స్వాగతం పలకాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, పోలెపాక మార్టిన్ లూతర్, తూర్పు నియోజక వర్గ కన్వీనర్ పోట్టి శ్రీనివాస్ గుప్త, ఉపాధ్యక్షులు ఎరుకుల రఘునారెడ్డి, కార్యదర్శి టేకుమట్ల రేణుక, ఓబిసి మోర్చ అధ్యక్షులు కందిమళ్ల మహేష్, బైరి శ్యామ్, గోకె వెంకట్, తూర్పు నియోజక వర్గ డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇంచార్జ్ లు, జోనల్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com